క్లుప్తంగా

గుడివాడ డీఎల్‌డీఓ సుబ్బారావు బదిలీ



చిలకలపూడి(మచిలీపట్నం): గుడివాడ డీఎల్‌డీఓగా పనిచేస్తున్న కేవీ సుబ్బారావును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. సుబ్బారావు గుడివాడ డీఎల్‌డీఓతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జ్‌గా కూడా పనిచేస్తున్నారు. సుబ్బారావును స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

లేగదూడను రక్షించిన ఫైర్ సిబ్బంది



కైకలూరు: డ్రెయిన్‌లో చిక్కుకుపోయిన లేగదూడను అగ్నిమాపక సిబ్బంది బుధవారం రక్షించారు. స్థానిక సీనియర్ జడ్జి కోర్టు ఎదురుగా డ్రెయిన్‌లో లేగదూడ పడిపోయింది. డ్రెయిన్‌లో ఇరుక్కుపోవడంతో పైకి లేవలేకపోయింది. కోర్టు సూపరింటెండెంటు మహేష్ ఈ విషయాన్ని కైకలూరు అగ్నిమాపక సిబ్బందికి తెలిపారు. దీంతో ఫైర్ ఆఫీసర్ కాంత్రికుమార్, సిబ్బంది శ్రీనివాసులు, రవీంద్రబాబు, రాజేంద్ర లేగదూడను బయటకు తీశారు. ఫైర్ సిబ్బంది చొరవను పలువురు అభినందించారు.

నేటి నుంచి జీపీడీపీపై శిక్షణ తరగతులు

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం నుంచి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికను రూపొందించడంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీ కో ఆప్షన్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి



రామవరప్పాడు: భూసారాన్ని దెబ్బతీసే రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి రంగనాథబాబు రైతులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని ఆర్బీకేలో జిల్లా వ్యవసాయ వనరుల శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంలో నూతన పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. నిపుణుల సలహా మేరకు సాగు చేపట్టాలని సూచించారు. ఈ క్రాప్, విత్తనాల రకాల ఎంపిక, ఎరువుల వాడకాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్ర సందర్శన చేసి తెల్లజొన్న పంటను పరిశీలించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌సీ, ఏడీఏ మొనీషా, వీఏఏ శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

బైక్ ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలు

పెనమలూరు: విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలు కావటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి గ్రామానికి చెందిన డి.సత్యగౌరిదేవి భర్త రత్నకిషోర్ కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. వారు మంగళవారం కుటుంబ సభ్యులతో పోరంకిలోని ఓ సినిమా హాల్‌లో సినిమాకు వెళ్లారు. సినిమా పూర్తయిన తరువాత సత్యగౌరిదేవి, ఆమె కుమార్తె భవ్యశ్రీ, అత్త సత్యనారాయణమ్మ బందరు రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన బైక్ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలు అవ్వటంతో 108 వాహనంలో విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉంగుటూరు: చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై చిన్న అవుటపల్లిలో ఆర్టీఏ చెక్ పోస్ట్ సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రకాశం జిల్లా మన్నేపల్లి గ్రామానికి చెందిన రమేష్, ఖమ్మంకు చెందిన నరేష్ ఇద్దరు బుధవారం హనుమాన్‌జంక్షన్ నుంచి ఆటోలో విజయవాడ వైపు వెళ్తున్నారు. గన్నవరం మండలం చిన్న అవుటపల్లిలో ఆర్టీఏ చెక్‌పోస్ట్ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్కూరు ఎస్ఐ సూర్యశ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చారిత్రాత్మకం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



పామర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: రాజ్యాంగ నిర్మాత భరత జాతి ముద్దుబిడ్డ, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం విజయవాడ నగర నడిబొడ్డున ఏర్పాటు చేయటం చారిత్రాత్మకమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. విజయవాడలో ఈ నెల 19వ తేదీన అంబేడ్కర్ విగ్రహావిష్కరణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం భవిష్యత్ తరాల వారికి ప్రేరణగా ఉంటుందన్నారు. దేశం అభివృద్ధి చెందడమంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదన్నారు. సామాన్య పౌరుని నైతిక అభివృద్ధి నిజమైన దేశ అభివృద్ధి అని పేర్కొన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధించేందుకు తపిస్తున్నారన్నారు. అంబేడ్కర్‌ను గౌరవించుకోవడమంటే యావత్ భారత జాతిని గౌరవించుకోవడమేనని తెలిపారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కె స్వరూపరాణి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, సచివాలయ మండల కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: విజయవాడలో ఈ నెల 19న జరగబోయే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మొవ్వ మండలం ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కైలే అనిలకుమార్ పిలుపునిచ్చారు. మొవ్వ గ్రామంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సామాజిక సమతాసంకల్ప సభ సమాయత్త సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ కోరుకున్న విధంగా సమసమాజ స్థాపన దిశగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీఓ సుధాప్రవీణ్, సర్పంచ్ తూము పూర్ణ చంద్రరావు, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత ఎంపీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



మొవ్వలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనిల్, నాయకులు

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

తోట్లవల్లూరు: వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగ ఫలాలు అందించిన మహోన్నతవ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. విజయవాడలో ఈ నెల 19న రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరిగింది. తొలుత మార్కెట్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించి, సామాజిక న్యాయశిల్పం బ్యానర్‌పై సంతకం చేశారు. స్మృతివనం ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాలుపంచుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ ఎం.కుసుమకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్ జిల్లా కన్వీనర్ మోర్ల రామచంద్రరావు, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పమిడిముక్కల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ కార్యక్రమానికి భారీ సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులకు జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సన్నాహక కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విజయవాడ నడిబొడ్డున సామాజిక న్యాయానికి అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు యేసుగ వెంకటరమణకుమారి, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కొండేటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష

పై సభ అనంతరం ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ధాన్యం కొనుగోలులో ఇబ్బందులపై రైతులు, తహసీల్దార్ రాజ్యలక్ష్మితో సమీక్ష నిర్వహించారు. తుపాను సందర్భంగా ఆఫ్‌లైన్‌లో ధాన్యం తోలిన రైతులకు నేటికీ డబ్బులు రాలేదని రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై పౌరసరఫరాలశాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. రైతులు తొందరపడవద్దని చెప్పారు. రైతులకు ధాన్యం కొనుగోలు, నగదు చెల్లింపుల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌కు సూచించారు. అమీనపురానికి చెందిన రైతు రాము ఉపాధి పథకంలో మునగసాగు చేసి నష్టపోయానని, ఆ శాఖ సిబ్బంది తనను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే వెంటనే డ్వామా పీడీతో మాట్లాడి రాముకు నష్ట పరిహారం అందేలా చూడాలన్నారు.

స్వచ్ఛందంగా రావాలి

ముదినేపల్లి రూరల్: అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పార్టీ శ్రేణులంతా విజయవాడకు స్వచ్ఛందంగా తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు కోరారు. ముదినేపల్లిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

నేడు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

కైకలూరు: బ్రహ్మబాబా అవ్యక్త దివస్ సందర్భంగా కైకలూరు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో గురువారం పలు అధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ధనలక్ష్మి, పావని బుధవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటలకు యోగం, 10.30 గంటలకు మురళీ గురువుతో యోగా తరగతులు, మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మభోజనం, సాయంత్రం బాబామిలన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు భారీ వాహనాలకు అనుమతి లేదు

గుడివాడరూరల్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రా కదలిరా కార్యక్రమం ఉన్న ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం 12గంటల నుంచి భారీ వాహనాలకు పట్టణంలోకి ప్రవేశం లేదని గుడివాడ తాలూకా సీఐ ఏసుబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. లారీలు, ప్రైవేట్ వాహనాలను హనుమాన్ జంక్షన్, ముదినేపల్లి, గుడ్లవల్లేరు, పెదపారుపూడి, పామర్రు ప్రాంతాల నుంచి అనుమతించబడవని, దీనికి భారీ వాహనదారులు సహకరించాలని కోరారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా వేరే మార్గం ద్వారా ప్రయాణించాలని సీఐ సూచించారు.

మండవల్లిలో బాలికల 'ఆడుదాం ఆంధ్రా'



మండవల్లి హైస్కూల్లో బాలికల బ్యాడ్మింటన్ పోటీలు

మండవల్లి: మండవల్లి బాలికల ఆడుదాం-ఆంధ్ర ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో మండవల్లి-కొవ్వాడలంక జట్లు తలపడ్డాయి. మండవల్లి టీమ్ విజయం సాధించింది. కబడ్డీ, ఖోఖో పోటీల్లో కానుకొల్లు-చింతపాడు, లింగాల-పెనుమాకలంక జట్లు తలపడ్డాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఈఓపీఆర్డీ ఎ.ఆనందబాబు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం-ఆంధ్రా క్రీడలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరు గ్రామంలో ఓ వ్యక్తిపై నలుగురు దాడి చేయటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన గోగం గోపీ బోర్‌వెల్ పనులు చేస్తుంటాడు. కాగా గోపీ స్నేహితులతో సుగాలీకాలనీ వద్ద మాట్లాడుతుండగా అంద్రాజు అంజిశ్వరరావు, అంద్రాజు భార్గవ్, వల్లభనేని వెంకటేష్, మరో వ్యక్తి అకారణంగా గొడవ పడి దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

21న వాసవీ, వనిత క్లబ్ సభ్యుల ప్రమాణ స్వీకారం

పామర్రు: స్థానిక శ్రీ బొగ్గరపు జాలయ్య సుబ్బరత్నమ్మ కల్యాణ మండపంలో ఈ నెల 21వ తేదీన ఉదయం తొమ్మిది గంటలకు వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం జరుగుతుందని క్లబ్ అధ్యక్షుడు ఘంటసాల త్రివిక్రమ సాయిరాం తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అంతర్జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ రామచంద్రరరావు, ప్రమాణ స్వీకారోత్సవ నిర్వహణ జిల్లా గవర్నర్ కొత్త గణేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. క్లబ్‌ల సభ్యులు అందరూ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం శ్రీ వాసవీ వృద్ధాప్య పెన్షన్ పథకం ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీ సుధాకర్, కోశాధికారి కంచర్ల వీర జనార్దనరావు, వనిత క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జీఎన్‌వీహెచ్ సునీత, సీహెచ్ జయలక్ష్మి, కోశాధికారి కె ఉషారాణి పాల్గొన్నారు.

వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి



ముగ్గులు వేస్తున్న మహిళలు

కలిదిండి: కోడిపందేలు, జూదం వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహంకాళి రావు అన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శ్రామిక సంబరాలు పేరుతో మూలలంక, భాస్కరరావుపేట గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు రన్నింగ్, స్లో సైక్లింగ్, బాలికలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వి.భాస్కరరావు, కే శ్రీనివాసరావు, కేవీపీఎస్ నాయకులు ముంగం సురేష్, మహిళా సంఘం నాయకులు ఎస్ మహాలక్ష్మి, వి.వరలక్ష్మి, ఎం రుక్మిణి, డీవైఎఫ్ఐ నాయకులు గద్దె అనిల్‌కుమార్, పి.వెంకట రామకృష్ణ, జక్కంశెట్టి పెద్దిరాజు, కే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్నాటి, చోడే కుటుంబ సభ్యుల కలయిక



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పల్నాటి, చోడే కుటుంబ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: తెలుగు సంస్కృతి, సంప్రదాయలు, కుటుంబ విలువలు నేటి తరానికి తెలియజేప్పేందుకు మూడు తరాలకు చెందిన వారంతా ఒక్కచోట కలిసి సంక్రాంతి పండుగ ఉత్సాహంగా జరుపుకున్నారు. స్థానిక నూజివీడు రోడ్డులోని రైల్వేస్టేషన్ సమీపంలో దాసాంజనేయ స్వామి దేవస్థానం వద్ద పల్నాటి, చోడే కుటుంబ సభ్యుల సంక్రాంతి సంబరాలు నాలుగు రోజులుగా ఘనంగా జరిగాయి. దేశ, విదేశాల్లో స్థిరపడిన వారంతా సుమారు 200 మంది కుటుంబ సభ్యులు సంక్రాంతికి స్వ స్థలానికి తరలివచ్చారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ, తమ బంధుత్వాలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి కుటుంబం గొప్పతనాన్ని, కలిసిమెలసి ఐక్యంగా ఉండటంలో కలిగే అప్యాయతను వారసులకు తెలియజేశారు. ఆధునిక సమాజంలో ఒత్తిడితో కూడిన జీవనాన్ని గడుపుతూ, కుటుంబ విలువలు కనుమరుగవుతున్న తురుణంలో ఏటా సంక్రాంతికి కుటుంబ సభ్యులంతా కచ్చితంగా కలవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆటవిడుపుగా ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు, క్రికెట్, షటిల్, నృత్య పోటీలు నిర్వహించారు. పల్లెటూరు వాతావరణంలో బంధువుల మధ్య సంక్రాంతి జరుపుకోవటం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పల్నాటి పెద్ద మస్తాన్, చోడే సుబ్బారావు కార్యక్రమాలను నిర్వహించారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: ధనుర్మాస మహోత్సవాలు ముగింపును పురస్కరించుకుని పట్టణంలో బుధవారం భారీ అన్నసమారాధన జరిగింది. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద వేంచేసియున్న కోదండరామాలయంలో గత నెల 14వ తేదీన ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా కాలక్షేపాలు, భగవద్గీత పఠనం వంటి కార్యక్రమాలతో పాటు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ధనుర్మాస వేడుకలు ఈనెల 15వ తేదీన ముగిశాయి. ఈ సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పాలకులు గత 79 సంవత్సరాలుగా నిర్విరామంగా ఈ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు డొక్కు రాంబాబు, కార్యవర్గ సభ్యులు దారపురెడ్డి వెంకన్న, అంకెం శ్రీరామ్, అంకెం సీతారామ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, నాయకులు పంచకర్ల వెంకట్, సయ్యద్ గఫార్, కందుల నాగరాజు పాల్గొన్నారు.

ముందస్తుగానే ప్రణాళికలు సిద్ధం చేయాలి

ఎంపీపీ పుష్పరాణి



మండవల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆనందబాబు

గుడివాడరూరల్: రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తుగానే మండలంలోని పంచాయతీలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో ఉన్న సమస్యలను ఇప్పటి నుంచే గుర్తించి వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను తయారు చేసి సిద్ధంగా ఉండాలన్నారు. ఈ ప్రణాళిక తయారీలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పని చేసి తయారీలో పాటించాల్సిన ప్రక్రియలన్నింటినీ పాటించే విధంగా మండలస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల ద్వారా పంచాయతీ కార్యదర్శులు తెలుసుకుని మండలస్థాయి అధికారులకు తెలియపర్చాలని సూచించారు. అనంతరం పంచాయతీ ప్రణాళికలు ఏ విధంగా సిద్ధం చేయాలి, దానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ఈఓపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనగాని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఆనందబాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో పయనించేవిధంగా సర్పంచ్‌లు, కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కావాల్సిన నిధులు పెద్దఎత్తున మంజూరు చేస్తోందని పేర్కొన్నారు.

కొనసాగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

గుడివాడ టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాలు పట్టణంలోని 14వ వార్డు గుడ్‌మెన్ పేట బాలుర హాస్టల్ ప్రాంగణంలో, 36వ వార్డు సచివాలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వక్తలు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రారంభించి అమలు చేస్తున్నారన్నారు. ప్రజల ముంగిటకే ఆరోగ్య సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడత ప్రారంభించినట్లు పేర్కొన్నారు. దీనిలో కేవలం వైద్య పరీక్షలు నిర్వహించి వదిలి వేయడమే కాకుండా ఆశా వర్కర్ల ద్వారా ఎప్పుడికప్పుడే ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ హాస్పిటల్‌కు తరలించడం కూడా దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ శిబిరాల్లో 14వ వార్డులో పురుషులు 257, స్త్రీలు 211, మొత్తం 468 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ జీజీడీ ట్విన్‌సన్, డాక్టర్ బద్రీనాథ్, డాక్టర్ వి.లావణ్య పరీక్షలు నిర్వహించారు. 36వ వార్డు సచివాలయం శిబిరంలో పురుషులు 208, స్త్రీలు 104, మొత్తం 312 మందికి డాక్టర్ కృష్ణగిరీష్, డాక్టర్ జగన్ రాజు, డాక్టర్ జోగానంద్, డాక్టర్ ప్రశాంత్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ జ్యోతుల సత్యవేణి, అర్బన్ హెల్త్ సెంటర్ అధ్యక్షుడు టి.మోహన్‌రావు, వార్డు ఇన్‌చార్జిలు ఎం.రామ్‌ప్రసాద్, ఎం.ఆంజనేయులు, అల్లం రామ్మోహనరావు, కుర్మా రాజు పాల్గొన్నారు.

ప్రసాదంపాడు చేరుకున్న అమ్మ వార్ల రథం



విశేష అలంకరణలో అమ్మ వార్లు



రథానికి స్వాగతం పలుకుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, జెడ్పీటీసీ సభ్యుడు

రామవరప్పాడు: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ రథం ఊరేగింపు రామవరప్పాడులో పూర్తి చేసుకుని బుధవారం ప్రసాదంపాడు గ్రామంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, జెడ్పీటీసీ సువర్ణరాజుతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉత్సవ వాహనానికి ఆహ్వానం పలికి అమ్మవారి రథాన్ని ప్రసాదంపాడుకు తీసుకెళ్లారు. డప్పు, సన్నాయి వాయిద్యాల నడుమ ఎంతో వైభవంగా జరుగుతున్న ఈ గ్రామోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు పలు గ్రామాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో రథాన్ని అనుసరిస్తున్నారు. గురువారం సాయంత్రం పేరంటాలమ్మ గ్రామోత్సవాన్ని పూర్తి చేసుకుంటుంది. అదే రోజు రాత్రి వంతెన సెంటర్‌లోని రైవస్ కాలువలో ముగ్గురమ్మలకు తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు.

కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారి దాటుతున్న ఓ మహిళను కారు ఢీ కొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముక్కపాడుకు చెందిన శాంతమ్మ బుధవారం ఆత్కూరులోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటే ప్రయత్నం చేసింది. అదే సమయంలో ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న కారు శాంతమ్మను బలంగా ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.